హోటల్లో తాపీగా కాఫీ త్రాగి కుర్చీలోంచి లేస్తున్న సారథి ఎదురుగా అప్పుడే హోటల్లో ప్రవేశిస్తున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యంతో ఆగిపోయాడు.

కొద్దిగా మాసిన ధోతి, ఖద్దరు చొక్కా, మీద ఒక పాత జరీ కండువా, పాత చత్వారపు కళ్ళజోడు, నల్లగా, కొద్దిగా లావుగాఉన్న ఆ వ్యక్తిని చూడగానే సారథి మెదడులో పాత జ్ఞాపకాలు తళుక్కుమన్నవి. ఆ వస్తున్నది అతని చిన్ననాటి తెలుగు మాష్టారు రంగారావుగారు.

అతన్ని చూడగానే, తను చిన్నప్పుడు ప్రతి నెల పరీక్షలో ఆయన సబ్జెక్టులో ఫస్ట్ మార్కు తెచ్చుకోవటం, ఆయన ప్రతి విషయం తనతో సంప్రదించటం, ఆయనే అప్పటి క్లాస్ టీచర్‌కూడ కావటంవల్ల ప్రోగ్రెస్ రిపోర్టు యిచ్చేటప్పుడు, ఎప్పుడూ మొదటి మూడు రాంకులను దాటిపోవట మెరుగని తనను మెచ్చుకోవటం, ఏ ఫంక్షన్ జరిగినా తనకు 'క్లవర్ స్టూడెంటు' పేరుతో ప్రతిసారీ బహుమతి ఈయటం – అన్నీ గుర్తుకు వచ్చి ఒక్కసారి వళ్ళు పులకరించి పోయిందీ సారథికి.

కొన్ని సంవత్సరాల తరువాత తన చిన్ననాటి మేష్టారును చూసిన సారథి పట్టలేని సంతోషంతో గబగబా అతనికి ఎదురుగా వెళ్లి "నమస్కారం మేష్టారూ" అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

ఎవరూ తెలియని యీ భాగ్యనగరంలో 'తనకు నమస్కరించిన యీ వ్యక్తి ఎవరా ?' అని ఆశ్చర్యంగా చూశారు రంగారావుగారు.

"నేనే మేష్టారూ ! గుర్తుపట్టారా ?" ఆనందంతో అన్నాడు సారథి.

కొద్దిగా కనుబొమలు చిట్లించి చూశారు రంగారావుగారు.

గబుక్కున తన పొరపాటు గుర్తుకు వచ్చింది సారథికి. 'తను పన్నెండవ తరగతి పాసై సుమారు ఆరేళ్లు కావస్తున్నది. తను చాలా మారాడు అయినా కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత ఒక విద్యార్థి తన మేష్టార్ని గుర్తించినంత సులభంగా, ఆ మేష్టారు ఆ విద్యార్థిని గుర్తించకపోవచ్చు. ఈ ఆరేళ్లలో మేష్టారు ఎంతోమంది విద్యార్థులను చూసి వుంటారు. ఇందరిలో నన్ను గుర్తించకపోవటం సహజం ! అనుకున్నాడు.

"నేను మాష్టారూ! సారథిని. 1967వ సంవత్సరం 12వ తరగతి బ్యాచ్. మీరే మా క్లాస్ టీచర్‌గా ఉన్నారు అప్పుడు. మా గ్రూప్‌లో విజయ్, శ్యామ్, సుధాకర్‌లకు నాకు ఫస్ట్‌క్లాసులు వచ్చినవి. మా అందరికీ మీరు



ప్రెజెంటేషన్స్‌కూడ యిచ్చారు. గుర్తుకు వచ్చానా ?" ఆత్రుతతో ప్రశ్నించాడు సారథి.

క్రమక్రమంగా కనుబొమలు విడివడ్డవి రంగారావుగారికి. చిన్నగా గుర్తుకు వచ్చినట్లుంది పలకరింపుగా నవ్వారు.

"అరె! నీవటోయ్! మొదట్లో గుర్తుపట్టలేదు. బావున్నావా ?" అంటూ భుజం మీద చేయి వేశారు.

తొందరగానే తనను గుర్తుపట్టినందుకు పరమానందం కలిగింది సారథికి. "రాండి మేష్టారూ ! కాఫీ తీసుకుందురుగాని." లోనికి దారితీశాడు సారథి.

ఎదురెదురుగా రెండు కుర్చీల్లో కూర్చున్నారు యిద్దరూ.

"ఏమిటి మేష్టారూ ! సంగతులు ? హైదరాబాద్ ఎప్పుడు వచ్చారు ? ఎక్కడ ఉంటున్నారు" గబగబా అడిగాడు సారథి.

"నిన్ననే వచ్చానోయ్. మా నాన్నగారి ఫించను విషయంలో కొద్దిగ పనుండి వచ్చాను. నేనూ, మా నాన్నగారూ కలిసి వచ్చాము. మా నాన్నగారికి ఆస్తమా కూడ వున్నది. అది ఎవరైనా మంచి డాక్టరుకు చూపించాలి. ప్రస్తుతం హోటల్లో గది తీసుకుని వుంటున్నాము."

అప్పుడే అటుగావచ్చిన సర్వర్ని చూస్తూ "మేష్టారూ ! ఏంటిఫిన్ తీసుకుంటారు ?" అడిగాడు సారథి.

"ఏదైనాసరే !"

"ఏక్ ప్లేట్ ఇడ్లీ లావ్" ఆర్డరిచ్చాడు సారథి.

"అరె ! అదేమిటోయ్ ! నీవు తీసుకోవూ ?" ప్రశ్నించారు రంగారావుగారు.

"లేదండీ ! నేను యిప్పుడే తీసుకున్నాను. మీరు తీసుకోండి. ఇంతకూ మీ నాన్నగార్ని హాస్పిటల్లో చూపించారా లేదా? " ఎదురుగా వున్న నీళ్ల గ్లాసును చేతితో తిప్పుతూ ప్రశ్నించాడు సారథి.

"లేదోయ్. ఇంకా చూపించలేదు. ఇక చూపించాలి." టిఫిన్ తీసుకుంటూ అన్నారు రంగారావుగారు.

ఇంతలో గబుక్కున గుర్తుకు వచ్చింది రంగారావుగారికి తను సారథి వివరాలేమీ అడగలేదని. "అవునూ ! నువ్విక్కడ ఏం చేస్తున్నావు ?"

"యమ్. యస్‌సి. చేస్తున్నా మేష్టారూ! నిజామ్ కాలేజీలో. సబ్జెక్టు మ్యాథమెటిక్స్. పైనలియర్." తన వివరాలు గబగబా చెప్పాడు సారథి. అతని ముఖంలో తన చిన్నప్పటి మేష్టారికి, తను యీ గతించిన సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధిని గబగబా చెప్పి అతన్ని ఆనందపరచాలన్న ఆరాటం కనిపిస్తున్నది.

"ఆహా ! అలానా ? మరెక్కడ ఉంటున్నావు ?"

"కాలేజీ హాస్టల్లోనే ఉంటున్నాను మేష్టారూ!" కాలేజీకి దగ్గరనే హాస్టల్. ఈ సెంటర్ దాటగానే కనపడుతుంది."

ఇంతలో రంగారావుగారు టిఫిన్, కాఫీ తీసుకోవటం అయిపోయింది.

ఇద్దరూ లేచారు. బిల్లు చెల్లించటానికి జేబులో చేయి పెట్టబోతున్న రంగారావుగార్ని వారిస్తూ. " మేరే అక్కౌంట్‌మే లిఖ్ లీజియే." అన్నాడు సారథి కౌంటర్ దగ్గరున్న వ్యక్తితో.

" అచ్చా సాబ్ " అంటూ అతను పుస్తకం తీశాడు.

"అదేమిటోయ్ ! నీవిప్పుడేమిటి ? నేనిస్తానాగు. " మొహమాటంగా అన్నారు రంగారావుగారు.

"లేదు మేష్టారూ! మిమ్మల్ని ఆహ్వానించింది నేను. నేనివ్వటం న్యాయం." చిరునవ్వుతో అంటూ బయటికి అడుగులేశాడు సారథి.

"నేను వస్తుంటేనే కదా, నీవు పిలిచింది.

నీవు బిళ్లివ్వటం ఏమీ బాగాలేదు" చిన్నగా అంటూనే అతన్ని అనుసరించారు రంగారావు గారు. "అవునూ! మీ హాస్టల్‌కు మెస్‌లేదా? హోటల్‌కు వచ్చావేం ?"

చిన్నగా నవ్వాడు సారధి. "మా హాస్టల్లో యీ దేశంలోవున్నన్నిరాజకీయాలుమేష్టారూ! ఏవో గొడవలొచ్చినవి. వార్డెన్ మెస్‌క్లోజ్ చేశాడు. అసలు హాస్టలే ఖాళీ చేయమన్నాడు కాని, పరీక్షలు కాబట్టి మేం చేయమని మొండిపట్టు పడితే ఆగారు. ఇక మాకు కాఫీ, టిఫిన్‌లకు యీ హోటల్, భోజనానికి యమ్. ఎల్. ఏ క్వార్టర్సు క్యాంటీనే శరణ్యమయింది." అంటూ పక్కనున్న కిళ్ళీషాపులో ఒక వక్కపొడిపొట్లం కొని రంగారావుగారికి అందించాడు సారధి.

వక్కపొడి తీసుకుని, పొట్లం విప్పి తను కొద్దిగ వేసుకుని మళ్ళీ సారధికిస్తూ, "అరె! అట్లాయితే చాలా యిబ్బంది కదటోయ్." అన్నారు రంగారావుగారు.

"అబ్బే, నాకు అలవాటు లేదండి." అంటూ వక్కపొడి తీసుకోకుండా చేయి అడ్డం పెట్టి, "ఇబ్బంది అయితే మటుకు ఏం చేయగలం మాష్టారూ! అవసరం కదా!" అన్నాడు సారధి.

ఇంతలో యిద్దరూ సెంటర్‌కు చేరుకున్నారు. "మా హాస్టల్‌చూద్దురుగాని పదండి మేష్టారూ!" అంటూ సెంటర్ నుంచి కుడివైపుకు తిరిగాడు సారధి.

"అరె! ఇప్పుడెందుకు లేవోయ్!" అంటున్న రంగారావుగార్ని బలవంతపెట్టి హాస్టల్‌వైపు తీసుకెళ్ళాడు సారధి.

గదిలోకి అడుగు పెడ్తూనే గదిని పరిశీలించి చూశారు రంగారావుగారు. అది నీట్‌గా సర్దిఉన్న చిన్న గది. రెండవఅంతస్థులో లాల్ బహదూర్ స్టేడియమ్ వైపు ఎలాంటి గందరగోళం వినిపించకుండా చక్కగా ఉన్నది. గదికి స్టేడియమ్‌వైపు పెద్ద కిటికీ, ఒక బీరువా, కుర్చీ, టేబుల్, మంచము, కప్ బోర్డు—ఒకరికి చాలా హాయిగా సరిపోయేట్లు ఉన్నది.

"ఇదే నా రూమ్ మేష్టారూ! అన్నీ సింగిల్ రూమ్స్. చాలా కన్వీనియెంట్‌గా ఉంటుంది. రెండేళ్ళనుంచీ యిదే రూమ్‌లో వుంటున్నాను." అంటూ కిటికీ తలుపులు పూర్తిగా తెరిచాడు సారధి.

కప్ బోర్డులో పై రాక్‌లో పెట్టిఉన్న వెంకటేశ్వరుని ఫోటో, దానిముందర ఒక ఊదుబత్తీల స్టాండ్. అందులో సగం కాలిపోయిన అగరుబత్తి, ఫోటో ముందు ఒక ఎర్రటి ముద్ద మందారపువ్వు చాల అందంగా, అలంకరించినట్లు ఉన్నవి. వాటివైపు చూస్తున్న రంగారావుగారిని చూసిన సారధి, గబగబా ఆ ఫోటో వద్దకు వెళ్ళి, దాన్ని తీసుకుని రంగారావుగారి చేతికి యిచ్చాడు.

"ఇది నేను వేసిన చిత్రమే మేష్టారూ," సారధి కళ్ళు గర్వంతో మెరిశాయి.


"అరె! అట్లానా? ఫ్రేములోచూస్తే ఫోటోలాగానే వుందోయ్. బాగుంది."

"మేష్టారూ! మీకు యింకొక విషయం చెప్పాలి." అంటూ సారధి బీరువా తలుపు తెరిచి రెండు ఆంధ్రపత్రిక వీక్లీలు తెచ్చి రంగారావుగారి చేతికి యిచ్చాడు.

"మేష్టారూ! నేనీ మధ్య రెండుకధలు వ్రాసాను. అవి యీ వీక్లీలలో పబ్లిష్ అయినవి." అంటున్న సారధి ముఖం ఆనందంతో వెలిగిపోతున్నది.

"ఆహా! వెరీగుడ్!" అన్నారు చిరునవ్వుతో రంగారావుగారు.

చిన్నప్పటి తన తెలుగు పాండిత్యం పెద్దయిన తరువాతకూడ చూపిస్తున్నానని తన



**అమ్మకమునకు ఖాళీ స్థలము**

విజయవాడ గాంధీనగరము జ్ఞానోలీవు వీధిలోని 310 చదరపు గజముల ఇంటి ఖాళీ స్థలము అమ్మకమునకు సిద్ధముగా ఉన్నది. మంచి పరిసరములలోనూ మంచి సెంటర్ లోనూ ఉన్నది. ఫిలిం డి(స్ట్రి బ్యూషన్ ఆఫీసులకు వ్యాపార తదితర సంస్థలవారికి కూడా అనువైనది. కొనదలచుకున్నవారు ఈ క్రింది అడ్రసుకు వ్రాయవలెను.

బాక్సునెం.48, C/o ఆంధ్రసచిత్రవారపత్రిక, గాంధీనగరము, విజయవాడ—520003.

**దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధ వైద్యం!**



హస్తప్రయోగం, అంగంచిన్నదై అవసరకాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండ. రండి.

డా. దేవర, ఫోన్:551, మార్వాడీ గుడివద్ద, తెనాలి,
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17.

**మీకు సంతానం లేదా?**



ఆపరేషన్, యితర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతానవంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు.

ఉచిత వివరములకు

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం**

రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.

# తరాల అంతరాలు

చిన్నప్పటి మేష్టారుకు తెలుపుతున్నప్పుడు సారధి ముఖం కాంతివంతమైంది. తన విద్యార్థి యింత గొప్పవాడైనందుకు తన మేష్టారు ఎంత ఊహిస్తున్నా సారధి మనసు రెట్టింపు ఆనందంతో ఎగిసిపడుతున్నది.

"మరి గెస్టులు ఎవరైనా వస్తే..." ప్రశ్నించారు రంగారావుగారు.

"ఆ! నిరభ్యంతరంగా ఉండవచ్చు... అవును మేష్టారూ! మీరు హోటల్లో ఉండట మెందుకు? ఇక్కడికి వచ్చేయండి. మా ఫ్రెండొకడు మెడిసిన్ ఫైనలియర్. అతనికి తెలిసిన డాక్టర్ ఉంటారు. మీ నాన్నగార్ని ఎవరైనా మంచి డాక్టరుకు చూపిద్దాం ఏమంటారు?" ఆత్రుతగా అడిగాడు సారధి.

"ఇంత చిన్న రూమ్‌లో ఎలాగోయ్?" సందేహించారు రంగారావుగారు.

"మరేం ఫరవాలేదు మేష్టారూ! హాస్టల్లో అందరూ మా ఫ్రెండ్సేనాయె. నేను పక్క రూమ్‌లో పడుకుంటాను. మీరిక్కడ ఉందురుగాని. ఇద్దరయితే ఒకరు క్రింద, మరొకరు మంచంపైన – యిబ్బంది లేకుండానే పడుకోవచ్చు. మీరెక్కడ దిగారో చెప్పండి. మధ్యాహ్నం నేను వస్తాను. మీ సామాను తీసుకుని యిక్కడకు వచ్చేద్దాం" 'ఏమంటార'న్నట్లు చూశాడు సారధి.

మొదలు మొహమాటపడ్డా చివరకు ఒప్పుకున్నారు రంగారావుగారు. వెళ్లేముందు బాత్‌రూమ్, అవీ చూసి బాగున్నవని మెచ్చుకుంటూ తనుంటున్న హోటల్ రూమ్ నంబర్ యిచ్చి వెళ్లిపోయారు రంగారావుగారు.

గేటువరకు సాగనంపి వచ్చిన సారధి మనసు తన చిన్ననాటి మేష్టార్ని కలుసుకున్న సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బు కాసాగింది. పుస్తకం చదువుదామనుకున్నా. తన చిన్నప్పటి సంగతులన్నీ ఒకటి వెంబడి ఒకటి సినిమా రీళ్లలా కళ్లముందు మెదులుతున్నవి. మనసు పుస్తకంమీద లగ్నం కాలేదు. 'తను యింతటి స్థితిలోకి వచ్చినందుకు మేష్టారు ఎంత సంతోషపడ్డారో పాపం! ఏమైనా మధ్యాహ్నం వెళ్లి మేష్టార్ని తీసుకువచ్చి తన రూమ్‌లో ఉంచుకోవాలి. తన చేతనయిన సాయం చేయాలి. తన మనసెందుకో చాలా ఉల్లాసంగా వున్నది. చిన్నప్పటి స్నేహితులు, చిన్నప్పటి టీచర్లు కనపడితే ప్రతివాళ్లకు యిట్లాగే వుంటుందేమో ఆనందంగా. మేష్టారి మనసుకూడ బహుశ యిలాగే వుండవచ్చు.' ఆలోచనల్లో మునిగిపోయాడు సారధి.

* * *

ఆఫీసులోకి అడుగుపెట్టిన పరంధామయ్యగారు ఎదురుగా కుర్చీలో కూర్చునివున్న సూపరింటెండెంట్ దగ్గరగా వెళ్లి చిన్నగా నమస్కారంచేసి నిలబడ్డారు.

ఒకసారి తలవూపి తిరిగి తన వ్రాతపనిలో మునిగిపోయాడు ఆ సూపరింటెండెంట్, తల కూడ ఎత్తకుండా.

అటూ యిటూ చూస్తూ 'అతను ఎప్పుడు తలెత్తుతాడా?' అని ఎదురు చూస్తూ నిల్చున్నారు పరంధామయ్యగారు.

అర్ధగంట గడిచిన తరువాత తలెత్తిన సూపరింటెండెంట్ ఒక క్షణం ముఖం చిట్లించి 'ఏమిటి' అన్నట్లు ప్రశ్నార్ధకంగా చూశాడు.

కాళ్లు పీక్కోబోతున్నా, సుమారు డెబ్బయ్యేళ్ల వయసులో అలా నిలబడటం కష్టమైనా, అలాగే పళ్లబిగువున నిల్చున్న పరంధామయ్యగారికి తలెత్తిన ఆ వ్యక్తిని చూడగానే అతన్నిదివరకెప్పుడో చూసినట్లనిపించింది.

"ఏమిటో చెప్పండి" విసుగ్గా అన్నాడు ఆ సూపరింటెండెంట్.

అరనిమిషం ఆలోచించిన పరంధామయ్యగారికి గబుక్కున గుర్తుకు వచ్చింది అతను తను చదువుచెప్పిన రాజారావేనని.

ఒక్కక్షణం ఎవరో ఆత్మీయుల్ని చూసినంత సంతోషం కలిగింది పరంధామయ్యగారికి. చిన్నప్పుడు అతను బడికి రానని మారాం చెయ్యటం, వీపు చీరేస్తానని బెదిరిస్తూ తను ప్రతిరోజూ అతన్ని బడికి తీసుకువెళ్లటం, అతను తన కన్నుగప్పి తిరిగి పారిపోయి కోతికొమ్మచ్చులాడటం, అప్పుడు తను అతన్ని బుజ్జగించి తిరిగి బడికి తీసుకెళ్లటం, స్కూల్ ఫైనల్ ఫేలయినప్పుడు అతను చచ్చిపోతానని ఏటి ఒడ్డుకు పోగా అతనికి నచ్చజెప్పి తిరిగి అతనితో పరీక్ష కట్టించటం అన్నీ గుర్తుకువచ్చి వళ్లు పులకరించిపోయింది.

అంతసేపు ఎవరో అనుకుని మొహమాటంగా నిల్చున్న పరంధామయ్యగారు అతను తన పాత శిష్యుడేనని తెలుసుకున్న

మరుక్షణం, అక్కడే ఉన్న కుర్చీ లాక్కొని కూర్చున్నారు. "ఏమోయి రాజారావ్! బాగున్నావా? ఇక్కడే పని చేస్తున్నావా?" అని అడుగుతూ.

వింతగా చూశాడతను పరంధామయ్యగారి వైపు.

అది గమనించలేదు పరంధామయ్యగారు. "అబ్బ! ఈ పట్నంలో నిన్ను చూసిన తరువాత చాల ఆనందంగా ఉందోయ్. అవునూ! మనం కలుసుకుని చాలరోజులు అయింది కదూ! అప్పుడు స్కూల్‌ఫైనల్ పాసయిన తరువాత నీవు మీ మేనమామగారింటికి వచ్చావు కదూ! తరువాత ఏం చేశావు? ఇంతకూ పెళ్లయిందా? పిల్లలా?" హడావుడిగా తన ధోరణిలో తను అడుగుతూ పోసాగారు పరంధామయ్యగారు.

ఏమీ అర్థంకానట్లు చూశాడు ఆ సూపరింటెండెంట్. అది చూశారు పరంధామయ్యగారు. "ఏమోయ్! గుర్తుపట్టలేదా నన్ను? అవునులే! మనం కలుసుకుని చాలా సంవత్సరాలయ్యె. నేనేనయ్యా, నీ చిన్నప్పటి మేష్టార్ని, పరంధామయ్యను. ఇప్పుడు గుర్తుపట్టుంటావు. అప్పటి సంగతులు గుర్తుకు వస్తే భలే ఆనందంగా ఉంటుందోయ్. మన వాళ్లందరూ ఏం చేస్తున్నట్లు? శేఖర్ స్కూల్ ఫైనల్ పాసయినాడా? రామం వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిసిందిలే! అవునూ! ఈ మధ్యేదో ఫించన్లు మనియార్డర్ ద్వారా పంపిస్తారని తెలిసింది. నేను రిటైరయ్యానులే! ఆ విషయం కనుక్కోవాలనే వచ్చాను. ఇంతకూ నీ విశేషాలేమీ చెప్పవేం?" గబగబా మాట్లాడుతూ అతని ముఖంలోకి చూశారు పరంధామయ్యగారు.

అతని ముఖం చిరాకుతో నిండిపోయింది. "సారీ! నేను మిమ్మల్ని గుర్తుపట్టలేదు. మీ పనికోసం మీరు—అదుగో ఆ కనపడే క్లర్కు దగ్గరకు వెళ్లి కనుక్కోండి. నాకు పని ఉంది. నేను వెళ్తున్నాను" అంటూ అతను అంతవరకూ తనుచూసిన ఫైలు డెస్కులో పడవేసి అక్కడనుంచి కదిలాడు.

పోతున్న అతనివేపు తెల్లబోతూ అలానే చూస్తుండిపోయారు పరంధామయ్యగారు ఒక రెండు నిమిషాలు. అతను వేసుకున్న దుస్తులు, అతని వేషం ఒకసారి చూసి, తన చిరిగిపోయిన చొక్కా, పాతకోటు. మాసికలు వేసిన ధోతి చూసుకొని నిట్టూర్చారు పరంధామయ్యగారు. 'అవును అతని హోదాకు తను తూగలేదు. అతను రాజారావు కాదన్నది అబద్ధం. అతని నుదుటి మీద చిన్నప్పుడు కోతి కొమ్మచ్చు లాడుకుని క్రింద పడ్డప్పుడు అయినమచ్చ కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. అతను గుర్తుపట్టలేదన్నది కూడ అబద్ధమే మొదటిసారి తన ముఖంలోకి చూసినప్పుడు అతనిముఖంలోని భావాలు తను పసిగట్టాడు. అతను తనను గుర్తుపట్టాడు. కాని తను తెలుసుననటానికి బహుశః అతనికి హోదాఅడ్డం వచ్చిందేమో! ఒక్కక్షణం బాధపడ్డారు పరంధామయ్యగారు. 'ప్చ్! ఏమిటో! ఈమమతానుబంధాలు మనకు తెలియకుండానే పెరిగిపోతాయి. ఎదుటివారు దాన్ని గుర్తించకపోతే మనసు బాధపడుతుంది. అంతా భ్రమ! చిన్నగా లేచారు పరంధామయ్యగారు.

అతను చూపెట్టిన క్లర్కుదగ్గరికి వెళ్ళి, అతను చెప్పినట్లు తన అడ్రసుతో ఒక అప్లికేషన్ యిచ్చి బయటికి వచ్చారు.

* * *

"నేను వచ్చినదాకా ఆగలేకపోయావా నాన్నా! అసలే వంట్లో బాగాలేదాయె! ఎందుకు వెళ్ళావు ఒక్కడివీ?" గదిలోకి అడుగుపెడుతున్న పరంధామయ్యగార్ని చూస్తూ అన్నారు రంగారావుగారు.

ఒకసారి అతనివేపు నిర్లిప్తంగా చూసి మంచంమీద కూర్చున్నారుపరంధామయ్యగారు.


"వెళ్లిన పనేమయింది?"

"అయినట్టే" చిన్నగా నిట్టూర్చారు పరంధామయ్యగారు. "అదిసరే! హాస్పిటల్ కెప్పుడు వెళ్దాము? పొద్దున్నే ఎటు పోయావు? నీకోసం కొద్దిసేపుచూసి చిన్నగా హోయొద్దామని ఆఫీసుకు పోయాను. నువ్వొచ్చి ఎంతసేపయింది?' రంగారావుగార్ని చూస్తూ అన్నారు.

"నేను వచ్చి గంట సేపయింది. మనం రూమ్ ఖాళీచేయాలి. అక్కడ క్యారియర్‌లో మీల్స్ ఉన్నది, భోంచేయి. నేను సామాను సదురుతాను." అంటూ లేచారు రంగారావుగారు.

ఆశ్చర్యంగా చూశారు పరంధామయ్యగారు రంగారావుగారి వైపు.

అది గమనించి చిన్నగా నవ్వారు రంగారావుగారు. బ్యాగులో సామాను సదురుతూ "మనకొక రూమ్ దొరికింది. అక్కడికి పోవాలి" అన్నారు.




ప్రశ్నార్థకంగా చూస్తున్న పరంధామయ్యగారివైపు తిరిగారు రంగారావుగారు. "ఈ రోజు ఉదయం బలే గమ్మత్తు జరిగింది. నేను కాఫీకి పోయినప్పుడు ఆ హోటల్లో ఒకతను కనపడ్డాడు. ఇక్కడ్నే నిజామ్ కాలేజీలో యమ్. యస్‌సి. చేస్తున్నాడట. అతని చిన్నప్పుడు నేను అతనికి టీచర్నుట..."

"ట! అంటే నీవతన్ని గుర్తుపట్టలేదా?" ఆశ్చర్యంగా అడిగారు పరంధామయ్యగారు.

పకపకా నవ్వారు రంగారావుగారు. "నిజానికంతే. కాని గుర్తుపట్టినట్లు మాట్లాడాను, ఎందుకైనా పనికి వస్తాడని. నేననుకున్నట్లే అయింది. తన రూమ్ చూపెట్టాడు. బొమ్మలు గీస్తానని, కథలు వ్రాస్తాననీ ఏవో సోది చెప్పాడు. అన్నిటికీ నవ్వుతూ మాట్లాడేసరికి తన రూమ్‌లో వచ్చి ఉండమన్నాడు. తన ఫ్రెండుకు తెలిసిన డాక్టరుకు నిన్ను చూపెట్టవచ్చునన్నాడు. మన అడ్రసు యిచ్చాను. ఇప్పుడు వస్తాడు. మనం త్వరగా బయలుదేరాలి." తిరిగి బ్యాగు సదరటం మొదలు పెట్టారు రంగారావుగారు.

నిర్ఘాంతపోయారు పరంధామయ్యగారు. "అంటే... అంటే అతని అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని..."

తీవ్రంగా చూశారు రంగారావుగారు. "అమాయకత్వమేముంది? చిన్నప్పటి మేష్టార్ని కాబట్టి అతనే రమ్మన్నాడు. పోవటం తప్పా? ఉండటం తప్పా?"

"తప్పులేదు, అది నీవుకూడా అతన్ని గుర్తుపట్టినప్పుడు. నీవతన్ని గుర్తుపట్టకుండా.."

నిర్లక్ష్యంగా నవ్వారు రంగారావు

గారు. "గుర్తుపట్టేదేముంది? అయినా మన అవసరానికి అతను పనికివచ్చాడు. మనకు కావలసింది అది. అతను కథలువ్రాస్తే మన కెందుకు? బొమ్మలు గీస్తే మనకెందుకు? గుర్తుపట్టినట్లు మాట్లాడినందువల్ల ఎంత లాభమయిందో తెలుసా? ఈరోజు టిఫిన్ ఖర్చు తగ్గింది. ఇవ్వాళి నుంచి, మనమొక రెండు రోజులున్నా రూమ్అద్దె ఉండదు. అతని స్నేహితుడికి తెలిసిన డాక్టరే కాబట్టి బహుశ మనకు కన్సల్టేషన్ ఫీజుకూడ ఉండదు. ఈ కరువు రోజుల్లో యింతకన్నా కావలసినదేముంది?"

"ఛీ!" అతనివేపు అసహ్యంగా చూశారు పరంధామయ్యగారు. "నువ్వతన్ని గుర్తు పట్టావనుకుని అతనెంత ఆనందపడ్డాడో! అతని మనస్సు ఎంత సంతోషపడిందో! అది నిజంకాదని తెలిస్తే అతనెంత బాధపడతాడు?"

నిర్లక్ష్యంగా చూశారు రంగారావుగారు. "ఆ, సింగినాదం. అసలు అతను ఏ పనిమీద నన్ను మాట్లాడిచ్చాడో! లేకపోతే చిన్నప్పుడెప్పుడో చదువు చెప్పినంత మాత్రాన అంత వినయం చూపించాలా? ఆఖరికి వక్కపొడి యిస్తే కూడా తీసుకోలేదు. అతనికి నేనే మొదలు బ్రేకువేశాను. కాబట్టి సరిపోయింది. ఈ నక్క వినయాలన్నీ నా ముందరా? ఈ రోజుల్లో ఏ స్టూడెంట్ తన చిన్నప్పటి మేష్టార్ని చూసినప్పుడు గౌరవంగామాట్లాడుతున్నాడు? అతనికి నాతో పనే మీ లేకపోతే..."

ఒక్కసారిగా ఉద్రేకపడ్డాడు పరంధామయ్య గారు. 'ఛీ ఛీ! సుమారు పదిహేనేళ్లు టీచర్‌గా పనిచేసిన నువ్విలా మాట్లాడుతున్నావంటే...అవును. నీలాంటి వాళ్ల వల్లనే గురుశిష్యుల బంధం అపవిత్రమై పోయింది. అతను ఎంతో ఆనందంతో నిన్ను మాట్లాడిస్తే నీవతన్ని మోసం చేస్తావా? ఒక గురువు తన పాత శిష్యుణ్ణి చూసినప్పుడు, ఒక శిష్యుడు తన చిన్నప్పటి గురువుగార్ని చూసినప్పుడు పొందే ఆనందం చెప్తే తెలిసేదికాదు. అది అనుభవించాల్సిందే. ఒక వేళ అందులో ఏ ఒకరైనా యింకొకర్ని గుర్తు పట్టనప్పుడు రెండోవాళ్ల మనస్సు ఎంత బాధ పడ్తుందో తెలుసా? అంతెందుకు? ఈరోజు నేను పోయిన ఆఫీసులో సూపరింటెండెంట్ నా పాత విద్యార్థి

# తరాల అంతరాలు

'రాజారావని' ఒకతను. నాకెంతో సంతోషమయింది అతన్నిచూసి. నన్ను గుర్తుపట్టినట్లు చూశాడు. నేను పరంధామయ్యను. నీ చిన్నప్పటి మేష్టార్ని అని కూడ చెప్పాను. నిజానికి అతనూ నన్ను గుర్తుపట్టాడు. కాని ఆ మాట చెప్పటానికి, నా వేషం చూసిన అతనికి తన అంతస్థు అడ్డం వచ్చింది. అప్పుడు నా మనసెంత బాధ పడ్డదో తెలుసా? అతను మాత్రమేం చేస్తాడులే! పరిస్థితులు..."

మధ్యలో అడ్డగించారు రంగారావుగారు. "నీ విద్యార్థి నిన్ను గుర్తుపట్టలేదనే కద, నాన్నా నీవు బాధపడ్డది. అందుకే అతను బాధ పడ్తాడనే నేను అతన్ని గుర్తుపట్టి నట్లు మాట్లాడానని అనుకోరాదూ!"

"అది తప్పు! నా విద్యార్థి నన్ను గుర్తించి కూడా గుర్తించనట్లు ప్రవర్తించి ఎంత తప్పు చేశాడో, నీవు నీ విద్యార్థిని గుర్తించకనే గుర్తించినట్లు మాట్లాడి అంతే తప్పు చేశావు. అతనలా ప్రవర్తించడంలో ఎంత స్వార్థముందో, నీవిలా ప్రవర్తించటంలో కూడ అంతే స్వార్థముంది. నీవు స్వార్థరహితంగా అలా చేసినప్పుడు నిన్ను మెచ్చుకునేవాణ్ణి. కాని ..." ఆవేశంగా అంటున్న పరంధామయ్యగార్ని మధ్యలోనే ఆపారు రంగారావుగారు కోపంగా. "సరేలే! నీదంతా చాదస్తం. నీవలాగే చెప్తావు. స్వార్థంలేదు. తప్పులేదు' ఈ రోజుల్లో యింత సహాయం ఉచితంగా లభిస్తున్నదంటే ఎంత లాభం! అయినా ఖర్చుపెట్టేది నేనాయె! నీకేం తెలుస్తుంది ఆ బాధ! అతను వచ్చే టైమయింది. ఇక అంతటితో ఆపు." బ్యాగు గబగబా సరిది "అతను వస్తాడేమో! క్రిందికి పోయి వస్తా!" అంటూ తలుపుతీసిన రంగారావుగారు మరుక్షణంలో నిర్ఘాంతపోయారు.

ఎదురుగా సారథి!

అంతలోనే తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, "రావోయ్, రా! నీకోసమే వస్తున్నాను. రూమ్ తొందరగా కనుక్కోగలిగావా? వచ్చి ఎంతసేపయింది?" అంటూ తిరిగి రూమ్ లోకి దారి తీశారు రంగారావుగారు.

ఒక్కక్షణం అతనివైపు భావగర్భితంగా చూసి తనూ లోపలికి అడుగు వేశాడు సారథి. "సారీ, మేష్టారూ! నేనేదైతే వినకూడదో అదంతా విన్నాను. నేవచ్చి అర్ధగంట పైగానే అయింది." అంటూ.

మరుక్షణంలో రంగారావుగారి ముఖం నల్లబడ్డది. అచేతనంగా అలాగే నిలబడి పోయారు.

చిన్నగా పరంధామయ్యగారి వైపునడిచాడు సారధి. అతనివైపే చూస్తూ కూర్చుండి పోయారాయన.

"నమస్కారమండీ! మీరే మా మేష్టారి తండ్రి అని మీ మాటలవల్ల తెలిసింది. గురువుగారు అన్నపదానికి సరియైన నిర్వచనంగా నిలిచిన మిమ్మల్ని చూస్తున్నందుకు నాకు చాల సంతోషంగా ఉన్నది. మీ పాత విద్యార్థి మిమ్మల్ని గుర్తించనట్లు ప్రవర్తించినందుకు మీ మనసెంత బాధపడిందో నేను అర్థం చేసుకున్నాను. ఎందుకంటే ఒకరకంగా ప్రస్తుతం నేనూ అదే బాధలో వున్నాను." ఒక్కక్షణం ఆగి రంగారావుగారి వైపు చూసాడు సారధి "మేష్టారూ! మీరు నన్ను గుర్తుపట్టలేదన్నా నేనింత బాధపడేవాణ్ణి కాను. కాని మీరు ప్రవర్తించిన తీరుకు నాకు చాల బాధకలుగుతున్నది. కాని యిది తెలుసుకోండి. నేను మిమ్మల్ని మాట్లాడించింది మీ వల్ల నాకేదో పనివుండి కాదు. చిన్నప్పటి మేష్టారన్న అభిమానంతో. ఆ సంతోషంతోనే నేను వ్రాసిన కథలు. గీసిన చిత్రాలు చూపెట్టాను. మీరూ సంతోషిస్తారను కున్నాను కాని అది మీకు సొదిలాగా అవుతుందనుకోలేదు. నేను వక్కపొడి తీసుకోనిది నక్కవినయాలు ఒలకబోయటానికి కాదు

## నీ గుండెకాయ ఏమవుతుంది?

పరీక్షలో కాపీ కొట్టినవాడు పాసై...
మీ వాడు తప్పాడని తెలిసినప్పుడు...
నీకే ఫస్టు ప్రైజు వచ్చిందని నువ్వనగానే
మీ ఆవిడ ఆ లాటరీ టిక్కెట్ తగలే
సిందని తెలిసినప్పుడు...
నీ "గర్ల్ ఫ్రెండు" తో సినిమాకి వెడితే
ఆ ప్రక్క సీట్లోనే వున్నది నీ 'భార్యే'నని
తెలిసినప్పుడు...
నిన్ను మీ ఆవిడ తన స్నేహితు లందరికీ
"మా వంట మనిషి" గా పరిచయం
చేసినప్పుడు ... ... ? ? ?

— ఎం. రవీంద్ర కుమార్.

నాకు నిజంగా నే అలవాటు లేదు. మీరింత సంకుచిత స్వభావంతో ఆలోచిస్తారనుకోలేదు.

"బాబూ!..." ఏదో చెప్పబోయారు పరంధామయ్యగారు.

పరంధామయ్యగారి వైపు తిరిగాడు సారధి. "క్షమించండి మీరేమీ చెప్పవద్దు. నా మనసు ఏదో తెలియని బాధతో నిండిపోయింది. కాని మీరన్నది నిజమే, మీ విద్యార్థి మిమ్మల్ని గుర్తించనట్లు ప్రవర్తించటానికి అతని హోదాయే కారణం. అయితే బహుశః యింకొక కారణంకూడా ఉండి ఉండవచ్చు. అతనివల్ల మీరు ఆ ఆఫీసులో ఏమైనా పని కావాలంటారేమోనని అలా ప్రవర్తించి వుంటాడు. కాని ఒకటి మాత్రం నిజం. మీది పాతతరం. మా మేష్టారు, మీ రాజారావు – వీరందరూ యీ తరంవాళ్లు. మేము భావితరం వాళ్లం. తాతకు వారసుడు మనుమడే అన్నట్లు మీకు నిజమైన వారసులం మేమే. మీ రోజులలో యింత స్వార్థం, మోసం, అన్యాయం లేవు. అది మీకు తెలుసు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం మీరే. ఈ రోజుల్లో – కాలాన్ని వీళ్లు మార్చారో, కాలాన్నిబట్టి వీళ్లు మారారో కాని మీ రోజుల్లోలేని ఆ శక్తులు పెచ్చు మీరిపోయినవి. అందుకు – నన్ను క్షమించండి – అందుకు మీ రాజారావు, మా మేష్టారు వీళ్లే నిదర్శనాలు. ఈ రోజులలో కుర్రవాళ్లమీద వీళ్లకెవరికీ సదభిప్రాయం లేదు. ఎందుకంటే యీ పెద్దల అభిప్రాయాలు అటు మీతో కలవవు. ఇటు మాతో కలవవు. దేశం పాడైపోయిందనీ, ఈ రోజుల్లో కుర్రవాళ్లకు భయం, భక్తి లేవని ఉపన్యాసాలిచ్చే యీ పెద్దలవల్లనే నిజానికి దేశం పాడైపోయింది. అన్యాయం, వంచన, స్వార్థం పెరిగిపోయినవి. కాని ఒక విషయం మాత్రం నేను గట్టిగా చెప్పగలను. మళ్లీ మా రోజులు వచ్చేసరికి యివన్నీ మేము నిర్మూలిస్తాం. మళ్లీ కొత్తరోజులు అంటే వీళ్లకు కొత్త – మీ పాత రోజులు జ్ఞప్తికి తెస్తాం. నిస్వార్థం, న్యాయం, ధర్మం, మంచితనం–వీటితో నిర్మిస్తాం మా కొత్త లోకాన్ని. "ఈ రోజుల్లో పిల్లవాండ్లకు" అంటూ ఏవేవో అన్నారే మా మేష్టారు వారి అభిప్రాయాలు తప్పని నిరూపిస్తాం." ఆవేశంగా అంటూ ఒక్క క్షణం ఆగాడు సారధి. "క్షమించండి పెద్దవారు. మీ ముందర ఏవేవో అన్నాను. ఇవన్నీ కోపంతో, ద్వేషంతో అన్నవికావు. పట్టరాని బాధతో అన్నవి. మీరు అనుభవజ్ఞులు కాబట్టి మీకు మీ విద్యార్థి చేసిన అవమానాన్ని సహించి ఊరుకున్నారు. ఉడుకురక్తం కాబట్టి నేను ఆగలేకపోయాను." బాధగా నిట్టూర్చాడు సారధి.

"బాబూ!" సారధి భుజంమీద ఆప్యాయంగా చేయివేశారు పరంధామయ్యగారు.

"ఈ ఆ లోకాన్నిచూసి, నా పాతరోజులు జ్ఞప్తికి తెచ్చుకుని సంతోషపడటానికీ, అంతవరకూ బ్రతికే వరమీయమని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను." అన్నారు చెమ్మగిల్లిన కళ్లతో.

నిశ్చేష్టుడై నిల్చుండిపోయిన రంగారావుగారివైపు బాధగా చూశాడు సారధి.

"మేష్టారూ! నన్ను క్షమించండి. మీమీద నాకేం కోపంలేదు. అసలు మా ఫ్రెండుకు యాక్సిడెంటై హాస్పిటల్లో ఉన్నాడని తెలిసి అక్కడికి పోవాల్సివచ్చి, మీకు చెప్పి పోదామని రాకపోతే మీ సంభాషణ నేను విని ఉండక పోయేవాణ్ణి. నాకీ బాధ తప్పేది. మీరు నన్ను గుర్తుపట్టకపోయినా, నేనుమిమ్మల్ని గుర్తుపట్టానుకదా! మీకిష్టమైతే నారూమ్‌లో ఉండవచ్చు. నేను తిరిగి సాయంత్రం వస్తాను. ఈలోపల – మీకు ఒక అడ్రసు వ్రాసిస్తాను – మీరు ఆ అడ్రసుకువెళ్ళి, ఆ డాక్టరును కలుసుకోండి. అతను గుండెజబ్బుల స్పెషలిస్ట్. కాని ... కన్సల్టేషన్ ఫీజు తప్పకపోవచ్చు." అంటూ జేబులోంచి పెన్, పేపర్ తీసి, గబగబా అడ్రసు వాసి అక్కడ టేబుల్‌మీద పెట్టి, "వస్తాను, మేష్టారూ! సాయంత్రం వస్తాను. వస్తానండీ!" అంటూ పరంధామయ్యగారికి నమస్కారం పెట్టి బయటికి కదిలాడు సారధి, వ్యధాభరిత హృదయంతో.

జాలిగా అతనివేపే చూస్తూ నిల్చున్న పరంధామయ్యగారు, రంగారావుగారు గబగబా టేబుల్ దగ్గరకు వెళ్ళి, సారధి వ్రాసియిచ్చిన అడ్రసును ఉక్రోషంగా చింపి ముక్కలు చేయటం చూడనేలేదు.